క్లుప్తంగా

వైభవంగా విగ్రహ ప్రతిష్ట



ప్రత్యేక అలంకరణలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి

పుల్లంపేట: మండల పరిధిలోని అనంతంపల్లి పంచాయతీ, చాపల హరిజనవాడ గ్రామంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజారి శివశర్మ ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం వేకువ జామునే స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం లక్ష్మీనరసింహస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

గంగమ్మా.. చల్లంగా చూడమ్మా



ప్రత్యేక అలంకారంలో గంగమ్మతల్లి

సంబేపల్లె : మండల పరిధిలో వెలసిన శ్రీ దేవరరాయి నల్లగంగమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ దేవరరాయి నల్లగంగమ్మ తల్లి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. వేకువ జాము నుంచే అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బోనాలు సమర్పించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

రేపు గంగమ్మ తిరునాల



గుర్రప్పగారిపల్లెలో శ్రీ గంగమ్మ ఆలయం

వీరబల్లి (రాయచోటి టౌన్) : వీరబల్లె మండల పరిధిలోని గుర్రప్పగారిపల్లెలో వెలసిన శ్రీ గంగమ్మ తల్లి అమ్మవారి తిరునాలను మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. రేపు రాత్రి అమ్మవారికి అభిషేకాలు, పూజలు నిర్వహించి ప్రత్యేక అలంకరిస్తారు. అనంతరం రాత్రి అమ్మవారికి మొక్కులు తీర్చుకొనే వారు చాందినీ బండ్లు మెరవణి కూడా నిర్వహిస్తారని తెలిపారు. బుధవారం తెల్లవారు జామున అమ్మవారికి భక్తులు మొక్కులు చెల్లించుకోనున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఓబులవారిపల్లె: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం అడ్మిషన్ల కొరకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ హరిత పేర్కొన్నారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ చిన్నఓరంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్‌కు సంబంధించి బైపీసీ, ఎంపీసీ, హెచ్ఈసీ తెలుగు, ఇంగ్లీషు మీడియం గ్రూపులు ఉన్నాయని, విద్యార్థులు ఈ నెల 20వ తేది నుంచి దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. పదోతరగతి మార్కులిస్టు, టీసీ, ఒరిజినల్ స్టడీ సర్టిఫికెట్ తీసుకురావాలన్నారు. వివరాలు కోసం 9494849331 నంబర్‌ను సంప్రదించాలన్నారు. జూన్ 1వ తేది నుంచి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం క్లాసులు ప్రారంభించనున్నట్లు ఆమె తెలిపారు.

గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు



పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

రామాపురం : మండల కేంద్రంలోని గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి సూర్యనారాయణ రెడ్డి తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రంథాలయంలో దినపత్రికలు, విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉంటాయని, పుస్తకాలు చదవడంతో జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చునని తెలిపారు. గ్రంథాలయంలో ఆట పోటీలకు సంబంధించిన క్యారంబోర్డు, చెస్ అందుబాటులో ఉన్నాయని, జూన్ 7 వరకు వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తామని తెలిపారు.

గజవాహనంపై వేంకటేశ్వరుడు

మదనపల్లె సిటీ: స్థానిక దేవళంవీధిలోని శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం వాల్మీకివీధికి చెందిన ఉభయదారులు వ్యవహరించి స్వామి గజవాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు గోవింద నామస్మరణతో స్వామిని దర్శించుకుని పునీతులయ్యారు.

రాజంపేటలో అల్లరిమూకల అరాచకం!

- ఎన్నికల బిజీలో పోలీసులు
- రాత్రి వేళల్లో గస్తీకి ఇబ్బందులు
- టౌన్, రూరల్ ఏరియాలో మితిమీరిపోతున్న అల్లరి బృందాలు

రాజంపేట: రాజంపేటలో అల్లరి మూకలు అరాచకం తారాస్థాయికి చేరుకుంటోంది. బాధితులు పోలీసులకు ఫిర్యాదులు చేశారు. కానీ ఎన్నికల బిజీలో పోలీసులు తలమునకలవుతున్నారు. ఈ నేపథ్యంలో అల్లరి బృందాలు ఆగడాలు హద్దుమీరిపోతున్నాయి. నిత్యం రాత్రి వేళలో పోలీసులు గస్తీ తిరిగే వారు, ఇప్పుడు వారిని ఎన్నికల విధులు వెంటాడుతున్నాయి. ఈ పరిస్థితిలో అటు గస్తీ, ఇటు అరికట్టే చర్యలను సకాలంలో చేపట్టలేకపోతున్నారు. ఇప్పుడున్న పరిస్థితిలో పోలీసులకు పని భారం అధికమైంది. దీంతో సకాలంలో స్పందించలేకపోతున్నారు.

మన్నూరు, బోయనపల్లెలో..

పట్టణ సరిహద్దులో ఉన్న మన్నూరు ఏరియా, కడప-రేణిగుంట హైవే వెంబడి ఉన్న బోయనపల్లె ప్రాంతాల్లో కొంతమంది యువకులు బృందాలుగా ఏర్పడి బైకుల శబ్దంతో హోరెత్తిస్తున్నారు. రాత్రి వేళల్లో వీధుల్లో తిరుగుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ప్రజలు పోలీసులకు మొరపెట్టుకుంటున్నారు. ప్రశ్నిస్తే దుర్భాలాడుతున్నారని, అవసరమైతే దాడికి దిగుతున్నారని వాపోతున్నారు. మన్నూరు గ్రామంలో వక్కలవీధిలో అల్లరి మూకలు రాత్రి వేళలలో బైకులను రేజ్ చేస్తూ ఇబ్బందులను గురిచేస్తున్నారని బాధితులు మన్నూరు పోలీసులను ఆశ్రయించారు.



బోయనపల్లె గ్రామం

బోయనపల్లెలో కూడా...

కడప-రేణిగుంట హైవే నిత్యం రద్దీగా ఉంటుంది. ఆ ప్రాంతంలో ఇంజనీరింగ్ విద్యాసంస్థలు ఉండటంతో ఇతర జిల్లాలకు చెందిన విద్యార్థులతో న్యూబోయనపల్లెలో ఉదయం నుంచి రాత్రి వరకు రద్దీగా ఉంటుంది. గతంలో ఇక్కడ సబ్ కంట్రోల్ ఉండేది. ఇప్పుడు మూతపడింది. ఈ పరిస్థితిలో యువకుల బృందాలుగా ఏర్పడి స్వైర్య విహారం చేస్తున్నారు. అర్ధరాత్రి వరకు బర్త్‌డే సెలబ్రేషన్ పేరుతో బాణాసంచా పేల్చుతూ బోయనపల్లె వాసులకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నారు.

మద్యం మత్తులో చిందులు

బోయనపల్లెలో మద్యం మత్తులో యువకుల చేష్టలను స్థానికులు జీర్ణించుకోలేకపోతున్నారు. మద్యం సేవించి అల్లరి చేస్తున్నారు. మహిళలు బయటకు రావాలంటేనే వణికిపోతున్నారు. పోలీసులు మూకలను కట్టడి చేయాలని కోరుతున్నారు.

కట్టడి చేస్తాం



మన్నూరు, బోయనపల్లె ప్రాంతాల్లో అల్లరిమూకల ఆగడాలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. వారిపై నిఘా పెట్టాము. అల్లరిమూకలను గుర్తించి కౌన్సిలింగ్ ఇవ్వడం జరుగుతుంది. సరైన మార్గంలో నడుచుకోవాలని యువతకు అవగాహన కల్పిస్తాము. తీరు మార్చుకోకపోతే చట్టపరమైన చర్యలు తప్పవు. –సీఐ నరేంద్రనాథ్, మన్నూరు

కల్యాణం.. కమనీయం

పెనగలూరు (ఓబులవారిపల్లె): మండలంలోని దిగువసిద్దవరం గ్రామంలో శనివారం రాత్రి సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. సిద్దవరం తిరుపయ్య, మంగమ్మల జ్ఞాపకార్థం వారి మనువళ్లు, మనువరాళ్ల కల్యాణం, మహా అన్నదానం, గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కల్యాణానికి వందలాది మంది భక్తులు తరలివచ్చారు. కల్యాణం అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున గ్రామోత్సవం, వసంతోత్సవం నిర్వహించారు.

ఆకట్టుకున్న కోలాటం

సీతారాముల కల్యాణం సందర్భంగా నెల్లూరు జిల్లా, కావలి మండలం, బ్రాహ్మణపల్లెకు చెందిన శ్రీహరి కోలాటం బృందం శనివారం రాత్రి దిగువ సిద్దవరంలో కోలాటం వేశారు. ఈ కోలాటం ప్రత్యేకంగా ఆకర్షించింది. ఈ ప్రాంతాలలో చెక్కభజన, పండ్ర భజన వేస్తుండటంతో ఈ కోలాటం ప్రత్యేకంగా ఆకట్టుకుంది. కోలాటం తిలకించేందుకు చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు తరలి వచ్చారు.



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు

సిద్దవటం: మండల శివారులోని శ్రీ పెంచల లక్ష్మినరసింహ స్వామి దేవస్థానంలో స్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ సహాయ కార్యదర్శి పాలెం నరసింహ తెలిపారు. ఆదివారం ఆయన సిద్దవటంలో మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 21న స్వామి వారికి గణపతి పూజ, పుణ్యాహవాచనం, గోపూజ, యాగశాల ప్రవేశం, కలశపూజ, నవగ్రహ నరసింహ జపం, దీక్షా హోమం, అభిషేకం, పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. 22న లక్ష్మీనారాయణ జపం, నరసింహ హోమం, సుదర్శన హోమం, లక్ష్మీ హోమం, పూర్ణాహుతి, పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 23న తెల్లవారు జామున గరుడసేవ, సుదర్శన హోమం, అనంతరం లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవం, పూర్ణాహుతి నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



శ్రీ పెంచల లక్ష్మీనరసింహ స్వామి మూలవిరాట్

22 నుంచి బ్రహ్మోత్సవాలు

పెనగలూరు (ఓబులవారిపల్లె): మండలంలోని ఈటమాపురం లక్ష్మీనరసింహస్వామి కొండపై వెలసిన పెంచల నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 22వ తేది నుంచి ప్రారంభమవుతాయని ఆలయ ట్రస్టు చైర్మన్ బత్తిన తిరుపాల్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ద గుండాల్ రెడ్డి, ఆలయ అభివృద్ధి చైర్మన్ ఈటమాపురం శంకర్‌రెడ్డి తెలిపారు. 22న తెల్లవారుజాము నుంచి తిరుపతి వేదపండితులచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు, రాత్రికి నరసింహస్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కల్యాణం సందర్భంగా పంచాయతీలోని తూర్పుపల్లి గ్రామస్తులు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. కల్యాణానికి మండలంతోపాటు ఇతర మండలాల నుంచి వచ్చే భక్తులుకోసం ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. 22 నుంచి 27వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.



నరసింహస్వామి మూలవిరాట్

మిట్స్ కళాశాల పరిశోధకులకు ప్రోత్సాహం

కురబలకోట: అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో పరిశోధన అవార్డుల కార్యక్రమం నిర్వహించారు. వివిధ పరిశోధనలలో రాణిస్తున్న కళాశాలకు చెందిన అధ్యాపకులు, విద్యార్థులకు రూ. 5 లక్షల 30 వేలను ప్రోత్సాహకంగా అందజేసినట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ ఆదివారం తెలిపారు. ప్రపంచ స్థాయిలో పేరొందిన వెబ్ ఆఫ్ సైన్స్, స్కోపస్, ఎస్‌సీఐ, ఐఈఈఈ తదితర వాటిలో వీరి పరిశోధన పత్రాలు ప్రచురితం అయ్యాయన్నారు. మరింత ప్రోత్సాహకంగా ఈ నగదు పురస్కారాన్ని అందజేసినట్లు తెలిపారు

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్

వాల్మీకిపురం: చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని బాస్కెట్ బాల్ అసోసియేషన్ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు చింతల శ్రీధర్ రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వేసవి శిక్షణ శిబిరాన్ని పర్యవేక్షించారు. ప్రతి ఏడాది బాస్కెట్ బాల్ వేసవి శిబిరాన్ని సొంత నిధులతో నిర్వహిస్తూ, క్రీడాకారులకు శిక్షణ ఇస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువు ఎంత ముఖ్యమో, క్రీడలు కూడా అంతే ముఖ్యమన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసం, ఉత్సాహం లభిస్తాయన్నారు. ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచి 9గంటల వరకు, సాయంత్రం 5గంటల నుంచి 9గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. ఇక్కడ శిక్షణ పొందిన ఎంతో మంది క్రీడాకారులు మంచి ఉద్యోగాలు సంపాదించి, ఉన్నత స్థాయిలో ఉన్నారన్నారు. వంద మంది శిక్షణ పొందుతున్నారన్నారు.లో సెక్రటరీ రవిచందర్, కోచ్‌లు సాయిభార్గవ్ పాల్గొన్నారు.



క్రీడాకారులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

ఘనంగా చెన్నకేశవస్వామి జాతర

మదనపల్లె సిటీ: మదనపల్లె మండలం పెంచుపాడు పంచాయతీ కట్టుబావిలో ఆదివారం చెన్నకేశవస్వామి జాతర ఘనంగా జరిగింది. ఉదయం స్వామికి అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. ఆలయ ఆవరణంలో స్వామి కళ్యాణం కన్నుల పండువగా జరిగింది. సాయంత్రం ఉట్ల తిరుణాల జరిగింది. చెక్కభజనలు, కోలాటలతో యువకులు ఉత్సాహంగా ఉట్లమాను ఎక్కారు. కార్యక్రమంలో కట్టుబావి, పనసమాలకుంట, కొండకిందచౌడేపల్లె గ్రామస్థులు పాల్గొన్నారు.



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వైభవం.. లక్ష్మి నరసింహస్వామి రథోత్సవం



ప్రత్యేక అలంకరణలో స్వామి,అమ్మవార్లు

మదనపల్లె సిటీ: గోవింద నామస్మరణలతో శ్రీ లక్ష్మి నరసింహస్వామి రథోత్సవం కన్నుల పండువగా జరిగింది. భక్తులు గోవింద నామాలు జపిస్తూ రథం ముందు నడిచారు. మదనపల్లె మండలం సీటీఎంలోని శ్రీ లక్ష్మి నరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి రథోత్సవం నిర్వహించారు. ఆలయం వద్దనున్న రథంలో స్వామి,అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. రథంలో స్వామి,అమ్మవార్లను పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు రథంను వెంటనడిచారు. రథోత్సవం పురస్కరించుకుని భక్తులు రథంపై మిరియాలు, చిల్లర నాణెలు చల్లి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు టెంకాయలు కొట్టి కర్పూరహారతులు ఇచ్చారు. కార్యక్రమంలో సీటీఎం సర్పంచు ఆనంద్‌పార్థసారధి, ఎంపిపి రెడ్డమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్ర,వీరప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



రథం ఊరేగుతున్న స్వామి,అమ్మవార్లు

కన్నుల పండువగా గంగమ్మ తిరునాల

పీలేరు రూరల్ : మండలంలోని తలపుల పంచాయతీలో వెలసిన శ్రీ ఉలవల గంగమ్మ తిరునాల ఘనంగా ప్రారంభమైంది. ఆదివారం అమ్మవారికి అభిషేకం, అలంకరణ, ప్రత్యేక పూజలు, కలిశపూజ, నవగ్రహ పూజలు నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు బోణాలు ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి మొక్కుబడులు చెల్లించారు. రాత్రి మదనపల్లెకు చెందిన విజయలక్ష్మీ కలానాట కమండలిచే బాలనాగమ్మ నాటకం నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు మల్లికార్జున నాయుడు, సాగర్‌రెడ్డి, వెంకటరమణ నాయుడు, హరినాథనాయుడు మాట్లాడుతూ సోమవారం మధ్యాహ్నం హరికథా కాలక్షేపం, రాత్రి ఆసాదికథ, చాందినీబండ్లు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.



భక్తులు బోనాలు తీసుకొస్తున్న దృశ్యం

రెడ్డెమ్మతల్లీ ... కరుణించమ్మా..



సంతానం కోసం అమ్మవారి ఎదుట వరపడిన మహిళలు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. రెడ్డెమ్మతల్లీ చల్లంగా దీవించమ్మా..అంటూ భక్తులు మొక్కుకొన్నారు. ఈసందర్భంగా ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సంతనాన్ని ప్రసాదించే చల్లని తల్లిగా ప్రసిద్ధిపొందిన అమ్మవారి ఆలయానికి ఉదయం నుంచే భక్తుల రాక మొదలైంది. మహిళలు కోనేట్లో పవిత్ర స్నానమాచరించి అమ్మవారి ఎదుట సంతాన కోసం వరపడ్డారు. భక్తులు అమ్మవారికి బంగారు, వెండి, చీరెసారెలతో మొక్కులు చెల్లించుకొన్నారు.

గంగమ్మ ఆలయంలో భక్తుల సందడి

లక్కిరెడ్డిపల్లి: భక్తులు వేలాదిగా తరలిరావడంతో ఆదివారం గంగమ్మ దేవత ఆలయ ప్రాంగణం జాతరను తలపించింది. మొక్కులు ఉన్న భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి తలనీలాలు సమర్పించారు. గంగమ్మ తల్లి సేవా సమితి ఆధ్వర్యంలో గంగమ్మ తల్లిని ప్రత్యేకంగా అలంకరించారు. లక్కిరెడ్డిపల్లి సిఐ జీవన్ గంగనాథ బాబు, ఎస్ఐ విష్ణువర్ధన్ ఆలయం వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రెడ్డయ్య, ప్రత్యేక అధికారి మారుతీ ప్రసాద్, సర్పంచ్ వెంకట నారాయణ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు నరసింహారెడ్డి, ఉప సర్పంచ్ రాజబాబు, రవి పాల్గొన్నారు.

మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి

కలకడ : వర్షాకాలంలో దాతల సహకారంతో మొక్కల పెంపకంపై మానవత సంస్థ సభ్యులు ప్రత్యేక దృష్టి పెట్టాలని మండల శాఖ గౌరవ అధ్యక్షుడు లక్ష్మిరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం కలకడ జెడ్పీహైస్కూల్ ఆవరణంలో ఆ సంస్థ అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య అధక్షతన నెలవారి సమావేశం నిర్వహించారు. మండలంలో మానవత సంస్థ అందిస్తున్న ఉచిత సేవలను అనేక మంది సద్వినియోగం చేసుకుంటున్నారని, సంస్థ తరపున మరిన్ని మంచి పనులు చేపట్టాలని సూచించారు. చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారి నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు మొక్కలు ఏర్పాటు చేసి పోషించే బాధ్యతను కూడా సంస్థ సభ్యులు తీసుకోవాలని నిర్ణయించారు. ఆ సంస్థ జిల్లా కార్యవర్గ సభ్యులు గంగాద్రినాయుడు, శ్రీనివాసులురెడ్డి, సయ్యద్‌సాహెబ్ పాల్గొన్నారు.

పెద్ద మనసు చాటుకున్న పూజారివారిపల్లె



అంగళ్లు మల్లయ్యకొండ గోవులకు మరోసారి పశు గ్రాసాన్ని తోలిన పూజారివారిపల్లె గ్రామస్థులు

కురబలకోట: అంగళ్లు మల్లయ్యకొండపై మేత కరువైన మూగజీవాల పరిస్థితి అరణ్యరోదనగా మారింది. మరో వైపు కొండకు గుర్తు తెలియని వ్యక్తులు ఉన్నపాటున నిప్పంటించడంతో కొండలో ఉన్న పచ్చి మేత కాస్తా కాలి బూడిదైంది. దీంతో అక్కడి కొండపై ఉన్న గుడికి తోలిన 40 దాకా ఉన్న గోవులకు గడ్డి కష్టం వెంటాడింది. అంతేకాదు నోరు లేని గోవులు తమ బాధ గోడు గోస వేదనను ఎవ్వరితోను చెప్పుకోలేవు. మాకిది కావాలని మొర పెట్టుకోలేవు. వీటి బాధ వేదనను ఇటీవల సాక్షి దినపత్రిక ద్వారా తెలుసుకుని మండలంలోని తెట్టు గ్రామం పూజారివారిపల్లె గ్రామస్థులు చలించిపోయారు. మేమున్నామని ముందుకు వచ్చారు. ఇంటి వద్ద గాటిలో వారి పశువులను చూసినప్పుడల్లా మల్లయ్యకొండ గోవుల కష్టం గుర్తుకు వచ్చేది. దీంతో వాటికి అండగా నిలిచారు. నెల క్రితం ఊరిలోని వారు కలసి లోడు గడ్డి కొని అంగళ్లు మల్లయ్యకొండ గోవులకు తోలారు. అది అయిపోయి ఉంటుందని ఆదివారం మరో మారు లోడు పశు గ్రాసాన్ని అక్కడి గోవులకు తోలారు. ఇందుకు ఆ ఊరిలోని పురుషులు, మహిళలు, పిల్లలు సైతం 40 మంది దాకా తరలివచ్చారు. కొండపై సహపక్తి భోజనాలు నిర్వహించారు. అతిధులతో పాటు కొండపై ఉన్న దేవుని సేవకులకు కూడా ప్రీతితో వండించారు. ముచ్చటగా మూడోసారి కూడా త్వరలో మరో లోడు పచ్చి మేత ఇక్కడి గోవులకు తోలుతామని కూడా వారు ఆలయ కమిటీ చైర్మన్ కాకర్ల కృష్ణమూర్తికి చెప్పారు. పూజారివారిపల్లె గ్రామస్థుల పెద్ద మనసును వారి ఉపకారాన్ని పలువురు ప్రశంసిస్తున్నారు.

ఆదర్శప్రాయుడు పుచ్చలపల్లి సుందరయ్య



రాయచోటి అర్బన్ : సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు



ఒంటిమిట్ట: సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సీపీఎం నేతలు

రాయచోటి అర్బన్ : కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య అందరికి ఆదర్శప్రాయుడని ఏపీ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుక్కే విశ్వనాథనాయక్, ఏపీ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి, లంబాడా సంఘం నేత శంకర్ నాయక్ కొనియాడారు. పుచ్చలపల్లె సుందరయ్య 39వ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుందరయ్య దక్షిణ భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతల్లో ఒకరని చెప్పారు. సైకిల్‌పై పార్లమెంటుకు వెళ్లిన నిరాడంబర నేత అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల కార్యకర్తలు, నేతలు పాల్గొన్నారు.

సుందరయ్య ఆశయాలను కొనసాగిద్దాం

కమ్యూనిస్టు యోధుడు, ఆదర్శప్రాయుడైన సుందరయ్య ఆశయాలను కొనసాగిద్దామని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎ.రామాంజులు పిలుపునిచ్చారు. ఆదివారం సుందరయ్య వర్ధంతిని పురస్కరించుకుని సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో సుందరయ్య చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ సుందరయ్య కమ్యూనిస్టు పార్టీలో చేరి నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడారన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.వి.రమణ, జిల్లా కార్యదర్శి భాగ్యలక్ష్మి, సీపీఎం నాయకుడు మాధవయ్య, సీఐటీయూ నాయకులు ఆదిలక్ష్మి, సులోచన, ఆంజి, హర్ష, చెన్నయ్య, బాలాజి, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఘనంగా పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి

ఒంటిమిట్ట: ఒంటిమిట్టలో ఆదివారం పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ మండల కార్యదర్శి నరసయ్య మాట్లాడుతూ కామ్రేడ్ సుందరయ్య పేదలు, బడుగు, బలహీన వర్గాల భూములుకోసం రైతాంగ ఉద్యమం, పోరాటాలు చేసిన మహనీయుడని కొనియాడారు. పేదల సంక్షేమం కోసం ఆయన జీవితాంతం పోరాడారని గుర్తుచేశారు. సీపీఎం నాయకులు పి సురేష్ బాబు, ఎ హరిబాబు, ఎస్ సుబ్బయ్య, సాంబయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.